10 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

- 8రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- 15వ తేదీన కల్యాణం, 16న రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు





మాట్లాడుతున్న ఆలయ ప్రతినిధి శేషాచార్యులు, మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

అబిడ్స్: జియాగూడ శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలను 8 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి శృంగారం శేషాచార్యులు అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా శేషాచార్యులు మాట్లాడుతూ... 20 ఏళ్ల క్రితం బ్రహ్మోత్సవాలు, రథోత్సవం అత్యంత వైభోవంగా జరిగేదన్నారు. స్వామివారి రథం శిథిలావస్థకు చేరుకోవడంతో ఊరేగింపు ఉత్సవాన్ని నిలిపివేశారన్నారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం తిరిగి స్వామివారి రథోత్సవ కార్యక్రమం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్నామన్నారు. వైకుంఠ ఏకాదశి ఎంతో కీర్తిగడించిన జియాగూడ రంగనాథస్వామి ఆలయం అదే తరహాలోనే స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈనెల 10న శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వాములకు అభిషేకాలు, అలంకరణలతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయన్నారు.

- ప్రతిరోజూ అఖండ హారతి, తీర్థ ప్రసాదాలు కొనసాగుతాయి. 15వ తేదీన రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం, 16న సాయంత్రం స్వామివారి రథోత్సవం ఆలయం నుంచి బయలుదేరి పురానాపూల్ చౌరస్తా వరకు కొనసాగి తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. 17న స్వామివారికి చక్రస్నానం, 18న శ్రీ పుష్పయాగంతో ఉత్సవాలు ముగిస్తాయి. ఈ బ్రహ్మోత్సావాల్లో రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ, భక్తుల ముంగిట స్వామివారి దర్శన సౌభాగ్యం.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు, సహకారం అందిస్తామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై రథోత్సవాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా, రాజు సింగ్, గోపీసింగ్, శంకర్‌రాజ్, వివేక్ సింగ్, సందీప్ యాదవ్, కృష్ణ, బొట్టు రామేశ్వర్ పటేల్, వేణుగోపాల్ శంకరాచారి, భాస్కర్ గుప్తా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా కొనసాగుతున్న 'గొల్ల కలాపం'



కళాకారులకు నృత్య రూపకాన్ని ప్రదర్శింపజేస్తున్న నృత్య గురువు

సుల్తాన్‌బజార్: గొల్ల కలాపం కూచిపూడి నృత్యానికి తలమానికమైందని నృత్య గురువులు పేర్కొన్నారు. ఈ మేరకు నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న గొల్ల కలాపం శిక్షణ శిబిరం ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. దాదాపు 40 మంది నృత్య గురువులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని ఔత్సాహిక కళాకారులకు పలు నృత్యాలలో శిక్షణను ఇస్తున్నారు. ముఖ్యంగా గొల్ల కలాపంలో ముఖ్య పాత్ర దారులైన గొల్లబామ, సర్వ శాస్త్రాలు తెలిసిన విప్రుడు పాత్రల ద్వారా బ్రహ్మజ్ఞానం, ఆత్మజ్ఞానంతో పాటుగా జీవిత సత్యాలను గురువులు వివరించారు. దాదాపు 100 సంవత్సరాల క్రితం ఈ కలాపాన్ని రచించారని నవ్య నాటక సమితి వారు తమ వార్షికోత్సవంలో భాగంగా అనేక వైవిధ్యభరిత సంగీత నృత్య కార్యక్రమాలు, సెమినార్‌లు, శిక్షణ తరగతులు నిర్వహించిన యువ కళాకారులకు ఎంతో దోహదపడుతుందని నృత్య గురువులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువు డాక్టర్ బాగవతుల సేతూరామ్, నవ్యనాటక సమితి అధ్యక్షులు విజయ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయం



దుస్తులు పంపిణీ చేస్తున్న ధరంవీర్ సింగ్ బాల్‌చందర్

విజయనగర్‌కాలనీ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని సీనియర్ నాయకుడు ధరంవీర్ సింగ్, ఆసిఫ్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శీలం బాల్‌చందర్ అన్నారు. ఆదివారం ఆసిఫ్‌నగర్ డివిజన్ వాల్మీకినగర్‌లో పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెడుతున్న పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీ.రేనేశ్వర్‌గౌడ్, టి.భిక్షపతి గౌడ్, నవీన్, బాలప్ప, ఎస్. లక్ష్మీబాయి, పాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీసీ సెల్ అధ్యక్షుడిగా శంకర్



శంకర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉద్యమనేత పూనం శంకర్ నియమితులయ్యారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆయనను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పూనం శంకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం నలుమూలలా బస్తీలు, మురికివాడల్లో పర్యటించి బీసీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. బీసీ వర్గాల సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటానని ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వాసవీ క్లబ్ హైదరాబాద్ నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

అబిడ్స్: ప్రతిఒక్కరూ ఆరోగ్యకర జీవితం పొందేందుకు వాకింగ్, యోగా ఎంతో అవసరమని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రాజేందర్ పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయమైన మనిషి తన ఆరోగ్యం కోసం సమయం కేటాయించాలన్నారు. ఆరోగ్యంతోనే జీవితాంతం సంతోషంగా జీవిస్తారన్నారు. వాసవీ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మెల్కోటి పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పలువురికి సూచనలు చేశారు. ఎలాంటి అనారోగ్యం రాకుండా శరీరం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి అంబరిషా, కోశాధికారి వెంకటేష్, ఇతర ప్రతినిధులు రాజేశ్వర్‌రావు, నాగభూషణం, ప్రవీణ్, సత్యశ్రీనివాస్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు కొత్త సొబగులు



పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో టైల్స్ పరుస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ పోలీస్‌స్టేషన్ కొత్త సొబగులను సంతరించుకుంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం కొత్త భవనంలో ప్రారంభమైన ఈ పోలీస్‌స్టేషన్‌కు అప్పట్లో ప్రాంగణంలో టైల్స్ వేయలేదు. కాగా ఆదివారం నుంచి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో టైల్స్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ వారం నగర కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించనున్నారని తెలిసింది. ఈ కారణంగానే పోలీస్‌స్టేషన్‌కు కొత్త సొబగులతో తీర్చిదిద్దుతున్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లను అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, వీణా జైస్వాల్

సుల్తాన్‌బజార్: దివ్యాంగులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని దివ్యాంగులరకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు చేయూతను అందించేందుకు సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. వీణా జైస్వాల్, రామకృష్ణ, సందీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక సభకు భారీగా తరలి రావాలి

గోల్కొండ: నేడు జరగనున్న కాంగ్రెస భరోసా సభకు కార్వాన్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్తున్నామని కాంగ్రెస్ నాయకులు అహ్మద్ ఖాన్, ఎ.కృష్ణ అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే సభలో ప్రియాంకగాంధీ హాజరై యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారని వారు అన్నారు. కొట్లాది తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు న్యాయం చేయడం లేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం రౌడీయిజంతో లాక్కుందన్నారు. యువత ఈ సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

'మతం మారిన దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వొద్దు'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

గన్‌ఫౌండ్రీ: మతం మారిన దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లను ఇవ్వకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురుప్రకాష్ పాశ్వాన్ అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మతం మారిన దళిత క్రైస్తవులు రిజర్వేషన్ అర్హులా అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రామ్ లాంటి మహోన్నతులు మతం మారలేదని గుర్తుచేశారు. అనంతరం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రచురించిన మతం మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు ఇవ్వకూడదా..? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ వంశీ తిలక్, ఏబీవీపీ పూర్వ అధ్యక్షుడు మురళీ మనోహర్, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షుడు అంబేడ్కర్, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మోహన్, నగర అధ్యక్షుడు రాంబాబు, గోషామహల్ కన్వీనర్ జగపతి అరుణ్ పాల్గొన్నారు.

నేడు చిత్ర కళా ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పికాసో ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో మాతృదేవోభవ శీర్షికన పెయింటింగ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సంస్థలో శిక్షణ పొందిన చిన్నారులు మాతృమూర్తుల ఔనత్యాన్ని ప్రతిబింబించే విధంగా చిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సన్మానం



మాణిక్‌రావుఠాక్రేను సన్మానించిన పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: నగరానికి వచ్చిన పీసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను రాష్ట్ర పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈనెల 8న నగరానికి రానున్న కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ సభను పెద్ద ఎత్తున జయప్రదం చేస్తామన్నారు. ప్రియాంక గాంధీ రాకతో కార్యకర్తల్లో, నాయకుల్లో నూతన ఉత్తేజం వెల్లివిరుస్తుందన్నారు. ప్రియాంక సభను జయప్రదం చేసి బీఆర్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన అన్నారు. కాంగ్రెస్ తోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

గోల్కొండ కోటలో సందర్శకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట సందర్శకులతో కిటకిటలాడింది. కోటకు ఉదయం నుంచే పర్యాటకులు రావడం ప్రారంభించారు. భారీ సంఖ్యలో పర్యాటకులు రావడంతో అధికారులు అదనంగా సెక్యూరిటీ గార్డులను నియమించారు. మరోవైపు గోల్కొండకు వచ్చే ప్రధాన రహదారులు అన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. రాందేవ్‌గూడ రోడ్డుపై ఉన్న ఆషర్ ఖానా నుంచి గోల్కొండ కోట వరకు పర్యాటకుల వాహనాలతో రోడ్డు మొత్తం జామ్ అయ్యింది. లంగర్‌హౌస్ నుంచి కోటకు వచ్చే రోడ్డు సైతం ఇరువైపులా కిటకిటలాడింది. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో కోటలోని నగీనా బాగ్, ఇలాకానా, అక్కన్న-మాదన్న కార్యాలయాల వద్ద భారీ సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. కుతుబ్‌షాహీ రాణీవాసమైన ప్రత్యేక భవనాన్ని పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. గోల్కొండ కోట పరిసరాల్లో ఉన్న రెస్టారెంట్లు పర్యాటకులతో నిండిపోయాయి.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజేంద్రనగర్: భగవతిగూడలోని భవానీ, శివ, సాయి, ఆంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. ఈనెల 4 నుంచి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బ్రహ్మశ్రీ రేపల్లె రాజేష్‌శర్మ పంతులు ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున దేవాలయంలో దేవాలయ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు దేవిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శివ, భవానీ, గణపతి, సుబ్రహ్మణ్య, నాగదేవత, నంది, ఆంజనేయ, ధ్వజస్తంభ, సాయిబాబా, నవగ్రహ, బలిపీఠ శిఖర దేవాలయ ప్రతిష్ట కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'హనుమాన్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం'

గోల్కొండ: హనుమాన్ జయంత్యుత్సవాలను భారీగా నిర్వహిస్తామని జై భవానీ యువసేన ప్రతినిధి పి. నర్సింగ్‌రావు తెలిపారు. ఆదివారం షేక్‌పేట్ సీతానగర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తలతో కలిసి హనుమాన్ జయంత్యుత్సవాల వివరాలను వెల్లడించారు. ఈనెల 14న ఆదివారం జరిగే హనుమాన్ జయంత్యుత్సవాలను శ్రీ సీతరామానంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 14న ఉదయం 4 గంటలకు మేలుకొలుపు కార్యక్రమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. గణపతి పూజ అనంతరం ఉదయం 5 గంటలకు ఆంజనేయస్వామికి విశిష్ట అలంకరణ, 5.30 గంటలకు స్వామి వారికి 1108 తమలపాకులతో విశేష అర్చన, 6.20 గంటలకు ఏక హారతి, కుంభహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తరువాత హనుమాన్ చాలీసా పారాయణం, మహా హారతి, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయి. ఉదయం 9.30 గంటలకు భజన, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారికి మహానైవేద్యం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 5.15 గంటలకు నక్షత్ర హారతి, సామూహిక హారతి, 5.30 గంటలకు రామాలయం నుంచి స్వామి వారికి పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి. ఈ మహోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్

గోల్కొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తుందని బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి టీ అమర్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా సబ్జిమండికి చెందిన తన్వీర్ అహ్మద్‌కు మంజూరైన రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తున్నాయన్నారు. సామాన్య ప్రజలకే కాకుండా రైతులకు సైతం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, అయితే ఈ పథకాలన్నింటికీ పేర్లు మార్చి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందన్నారు. బీజేపీ కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ ఆకుల గోవర్ధన్‌రావు, బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, మైనార్టీ మోర్చా నాయకుడు అహ్మద్ పాల్గొన్నారు.

మట్టి కుండలకు భలే గిరాకీ



గోల్కొండ: వేసవి కాలం కావడంతో మట్టి కుండలకు బాగా అమ్ముడవుతున్నాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో మట్టి కుండలను తెచ్చి అమ్ముతున్నారు. మరోవైపు గోల్కొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో చల్లటి నీటికి మారుపేరైన ఆదిలాబాద్ రంజన్‌లు బాగా అమ్ముడవుతున్నాయి. 10 నుంచి 15 లీటర్ల సామర్థ్యం గల ఆదిలాబాద్ రంజన్‌లు రూ.350 నుంచి 450 ఒక్కటి అమ్ముతున్నారు. కాగా 2 నుంచి 5 లీటర్ల నీటి కుండలకు మంచి డిమాండ్ ఉంది. కాగా మట్టి కుండల తయారీలో కూడా కుమ్మరులు గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రకాలు, సైజులలో కుండలను తయారు చేసి అమ్ముతున్నారు. ఒక లీటర్ మట్టి బాటిల్, అరలీటర్ మట్టి బాటిల్ ప్రత్యేకంగా తయారు చేసి అమ్ముతున్నారు. అయితే పెయింట్ చేసిన మట్టి కుండలు కొనవద్దని మట్టి కుండల నిర్మాణం గురించి తెలిసిన వారు అంటున్నారు. కుండలకు పెయింట్ చేయడం వల్ల వాటిలోని నీరు చల్లగ కాదని, అంతేకాకుండా దాహం కూడా తీరదని పలువురు అంటున్నారు. పెయింట్ చేయని కుండలే కొనాలని వారు అంటున్నారు.



పంపాతీరం పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ప్రజలను చైతన్య పరిచేందుకు మంచి నవలలు రాయడం ఎంతో అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ డాక్టర్ శ్రీ మృనాళిని అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో స్వేచ్ఛా ప్రచురణలు ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ఓల్గా రచించిన పంపాతీరం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడతూ.. విదేశీ రచయితల రచనలతో ఈ నవలను పోలుస్తూ వివరించారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. కొత్త రచయితలు నవలను రాసేటప్పుడు విమర్శలను ఆహ్వానించాలని సూచించారు. మనం రాసిన నవల గురించి ప్రజలు మాట్లాడుకుంటే అది విజయమేనన్నారు. సినీనటి రోహిణి, డాక్టర్ బండ్లారు ప్రసాదమూర్తి, వేమూరి శోభారాణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రెడ్డి బస్తీలో నీటి ఎద్దడి



చాంద్రాయణగుట్ట: మారుమూల గ్రామాల్లో సైతం కృష్ణానీరు పూర్తి స్థాయిలో సరఫరా అవుతుండగా జీహెచ్ఎంసీ పరిధిలోని బస్తీల్లో మాత్రం అరకొర నీటి సరఫరాతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉప్పుగూడ డివిజన్‌లోని రెడ్డి బస్తీలో నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు రోజుల తరబడిగా ప్రైవేట్ ఆర్.వో ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తుంది. జలమండలి అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఎత్తుపల్లాలుగా ఉన్న రెడ్డి బస్తీలో ఎగువన ఉన్న ఇళ్లకు నీటి సరఫరా జరగకపోవడంతో.. మరో రూట్ నుంచి కనెక్షన్ ఇచ్చి సరఫరా చేస్తామంటూ తవ్వకాలు చేపట్టారు. వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నీటి సరఫరా జరగడం లేదని రెడ్డి బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల ఆటపాటలు, శాస్త్రీయ నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఆదివారం అబిడ్స్‌లోని ఓ ఆడిటోరియంలో హోలీమేరి విద్యా సంస్థల ఫేర్‌వల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీల ర్యాంప్ వాక్, నాటక ప్రదర్శనలు ఆకట్టుకోగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల కార్యదర్శి విజయ శారదరెడ్డి, కో చైర్మన్ సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నీటి వ్యాపారం

- వన్ మోర్ నగర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి దందా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వన్ మోర్ నగర్‌లో నీటిని నింపుకుంటున్న ట్యాంకర్లు

గోల్కొండ: ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా కొందరు అక్రమ నీటి వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. గోల్కొండ సమీపంలోని వన్ మోర్ నగర్‌లో కొంత కాలంగా ట్యాంకర్లు నింపి నగరంతో శివారు ప్రాంతాలకు నీటిని అమ్ముకుంటున్నారు. యథేచ్ఛగా సాగుతున్న బోరు అక్రమ నీటి వ్యాపారంతో స్థానికంగా ఉన్న నీటి బోర్లు ఎండిపోతున్నాయి. అక్రమ నీటి వ్యాపారంపై తహసీల్దార్‌తో పాటు ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇదిగో చర్యలు.. అదిగో చర్యలంటూ దాటవేస్తున్నారే తప్పా.. అధికారులు అక్రమ నీటి దందాను అడ్డుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసి అమ్మేవారు కొత్త పందాను అనుసరిస్తున్నారు. కొందరు స్థానికంగా జాగాను కొని అక్కడ కాంపౌండ్ వాల్ వేశారు. ఆ జాగాలో వేసిన బోరు నుంచి దర్జాగా నీటిని తోడుకుంటున్నారు. మరికొందరు స్థానికంగా ఖాళీ ప్లాట్లు, ఇళ్లను మార్టిగేజ్ చేసుకుని అక్కడ వాటిలో బోర్లు వేస్తున్నారు. కాగా వాల్టా చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న వారిపై తామ ఎన్నో మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. మరోవైపు పగలురాత్రి రాకపోలు సాగించే నీటి ట్యాంకర్ల కారణంగా స్థానికంగా తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు అంటున్నారు. వన్ మోర్ నగర్‌లో ట్యాంకర్లు రాకపోకలు సాగించే వీధులన్నీ బురదమయంగా మారాయి.

> **అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి..**
>
> 
>
> అక్రమ నీటి వ్యాపారంపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. క్రమం తప్పకుండా మళ్లీ మళ్లీ అధికారులను కలుస్తున్నాం. అయినా కూడా ఇదిగో అదిగో అంటూ అధికారులు తిప్పించుకుంటున్నారు. ట్యాంకర్ల యజమానుల దౌర్జన్యాలు నానాటికి పెరిగిపోతున్నాయి. స్థానికంగా భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించాలి.
>
> – ఓంప్రకాశ్, స్థానికుడు

మైత్రి కమిటీ సేవలు అభినందనీయం



సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ కరేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దయానంద్ తదితరులు

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమని సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ కరే అన్నారు. రాందేవ్‌గూడకు చెందిన దయానంద్ ఆదివారం ఆయనను మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఎస్. రాజు వస్తాద్, షాన్నవాజ ఖాన్, ఎం.ఎ.బేగ్ తదితరులున్నారు.

కాంట్రాక్టర్ల పాత బకాయిలు చెల్లించాలి



పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డు వెంటనే పాత బకాయిలు చెల్లించనిచో మెట్రో వాటర్‌బోర్డు ముందు ఆందోళన చేస్తానని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం మీడియా ఇన్‌చార్జ్, సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. వాటర్‌బోర్డు ఎండీ కాంట్రాక్టర్లను రోడ్డు పాలు చేశారని ఆరోపించారు. వెంటనే కాంట్రాక్టర్ల పాత బకాయిలు చెల్లించి ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వాటర్‌బోర్డు ఎండీకి వినతిపత్రం అందజేసినట్లు శ్రీనివాస్ వెల్లడించారు. ఏఎంఎస్ కొత్త విధానం ద్వారా వందలాదిమంది కాంట్రాక్టర్లకు పని లభించక రోడ్డు పాలవుతున్నారన్నారు. పాత బకాయిలు చెల్లించనిచో బోర్డు కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనకాడబోమని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చర్య తీసుకుని చిన్నా చితక కాంట్రాక్టర్లను ఆదుకోవాలన్నారు.